సమస్యల వలయంలో గ్రామాలు

- పల్లెల్లో కానరాని ప్రత్యేకాధికారులు
- పంచాయతీ కార్యదర్శులపైనే భారం
- పేరుకుపోతున్న సమస్యలు

చివ్వెంల : ప్రత్యేక అకాధికారుల పాలనలో పల్లెలు సమస్యలతో సతమతం అవుతున్నాయి. సంవత్సరం క్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన అనంతరం ప్రభుత్వం చివ్వెంల మండల వ్యాప్తంగా ఉన్న 31 గ్రామాలకు గెజిటెడ్ స్థాయి అధికారులను నియమించింది. సదరు అధికారులు మాతృశాఖతోపాటు అదనంగా అప్పగించిన బాధ్యతలను కార్యదర్శుల భాగస్వామ్యంతో నెరవేర్చాల్సి ఉంటుంది. ప్రభుత్వ పథకాలు అమలు చేయడం, అభివృద్ధి పనులు చేయడం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి, సమస్యలు ఉన్నచోట చక్కదిద్దాల్సి ఉంటుంది. దీంతో పాటు ఇంటి పన్ను వసూలు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి. అంతేకాకుండా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ, మండల ప్రత్యేకాధికారులు కలిసి పక్షం రోజులకు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించాలి. కానీ.. ఏ గ్రామంలో సభలు నిర్వహించిన దాఖలాలు లేవు. మాతృశాఖకు న్యాయం చేయలేక, అదనపు బాధ్యతలు నిర్వహించలేక ప్రత్యేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


చివ్వెంలలో ఇళ్ల మధ్య పేరుకపోయిన మురుగు


పాండ్యాభుక్యా తండాలో..

పారిశుద్ధ్యం లోపించి ఇబ్బందులు..

చివ్వెంల మండల కేంద్రంతోపాటు, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో వ్యర్థ జలాలు నివాసాల మధ్య నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే మురుగు నిలిచింది. పలు గ్రామాల్లో తాగునీటి కష్టం నిత్యం ఎదురవుతూనే ఉంది. దాని గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. జగనాతండా ఆవాసం పాండ్యా భుక్యా తండాలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల మధ్య నీరు నిలిచి చిన్నపాటి కుంటను తలిపిస్తోంది. ఇలా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక ఎన్నికలు జరిగి సర్పంచ్‌లు కొలువుదీరే వరకు ఈ కష్టాలు తప్పేలా లేవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరత అంటున్నారు

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు కనిపించడం లేదు. సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులను అడిగితే నిధుల కొరత అంటున్నారు. అసలు సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలి.

– ఎండీ రఫీ, చివ్వెంల

సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. ప్రభుత్వ పథకాలపై ఇంటింటి సర్వేలు ఉన్నందున కొంత ఇబ్బంది ఏర్పడింది. గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

– సీహెచ్. సంతోష్‌కుమార్, ఎంపీడీఓ

మెడికల్ మాఫియాను అరికట్టాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భానుపురి : ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తూ ప్రైవేట్‌లో మెడికల్ మాఫియాను అరికట్టాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పీఓడబ్ల్యూ, పీవైఎల్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కోటాచలంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా రోగులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషిమాత, కోశాధికారి మోటకట్ల జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు ఐతరాజు పద్మ, హుజూర్‌నగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, పావని పాల్గొన్నారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


సూర్యాపేట టౌన్ : హోమం నిర్వహిస్తున్న భక్తులు

సూర్యాపేటటౌన్ : లోక పావని శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, వాసవీ మాలధారణ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఏర్పాటుచేసిన కార్యక్రమాలు శుక్రవారం 5వ రోజు పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ వాసవీ మాతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 102 గోత్రీకులచే హోమం, మహా పూర్ణాహుతి జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీ వాసవీ మాతకు ముడుపులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తది తర పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తాటికొండ సీతయ్య, బండారు దయాకర్, ఈగ నాగన్న, శ్రీహరి, నాగయ్య, కేదారి, సత్యనారాయణ, వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


తుంగతుర్తిలోని రామాలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

శుభ ఘడియలు వచ్చేశాయ్..



తిరుమలగిరి, అర్వపల్లి : మాఘమాసం మొదలుకావడంతో శుభ ముహూర్తాలు ప్రారంభం అయ్యాయి. జనవరి 31వ తేదీ నుంచి మంచి రోజులు మొదలయ్యాయి. మార్చి 16 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఉగాది తర్వాత ఏప్రిల్, మే, జూన్ నెలలో కూడా కొన్ని మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు. దీంతో ఫంక్షన్‌హాల్‌లతోపాటు వివిధ రంగాల వ్యాపారులు, పనివాళ్లకు చేతి నిండా పని దొరకనుంది. మాఘమాసం మొదలు కావడంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఫంక్షన్‌హాల్‌లను బుక్ చేసుకున్నారు.

జూన్ 7వరకు మంచి ముహూర్తాలు



మాఘమాసంలో పెళ్లిళ్లతోపాటు శుభకార్యాలు బాగా జరుగుతాయి. శుభ ముహూర్తాలు జనవరి 31న మొదలు కానున్నాయి. అలాగే ఫిబ్రవరిలో 12 రోజులు, మార్చిలో 5రోజులు, ఏప్రిల్‌లో 9రోజులు, మేలో 7 రోజులు, జూన్‌లో 4రోజులు మంచి ముహూర్తాలు ఉన్నాయి. జూన్ 7తో శుభకార్యాలు ముగియనున్నాయి.

- మోత్కూరి రాజుశర్మ, పురోహితుడు

పెళ్లిళ్లకు మంచి రోజులు ఇవే..

జనవరి 31, ఫిబ్రవరి 2, 3, 7, 13, 14 ,15, 18, 19, 20, 21, 23, 25 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. అలాగే మార్చి నెలలో 1, 2, 6, 7, 12 తేదీలలో, ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీలలో, మేలో 1, 5, 6, 8, 17, 18 తేదీలలో, జూన్ నెల నందు 1, 2, 4, 7 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

గీత కార్మికుడికి నివాళి

తుంగతుర్తి : మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తండ రాజయ్య గురువారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, గీత కార్మిక సంఘం నాయకులు శుక్రవారం మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మృతుడు తండ రాజయ్య గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడని, ఈ పేదరిక కుటుంబానికి గీత కార్పొరేషన్ నుంచి ప్రభుత్వం వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉయ్యాల నగేష్, బుర్ర శ్రీనివాస్, వెలిశాల వెంకటరత్నం, మామిడి సోమయ్య, పులుసు సోమయ్య, బింగి వెంకటేశ్వర్లు, పులుసు యాదగిరి, గుండగాని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లు నిషేధం


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం

సూర్యాపేటటౌన్ : అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించడం నేరమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం అన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలకు అధికంగా ధ్వని వచ్చే సైలెన్సర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో 24 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన రైతుల వరి పొలాల పరిశీలన

పెన్‌పహాడ్ : ముందుగానే పొట్టుదశకు వచ్చి కంకులు ఏర్పడిన చింట్లు రకం వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి శుక్రవారం పరిశీలించారు. నాసి రకం విత్తనాల వల్ల తమ పొలాలు ముందుగానే పొట్ట దశకు వచ్చి నష్టపోతున్నామని రైతులు ఫిర్యాదు చేయడంతో ఆయన పంటలను పరిశీలించారు. పొట్లపహాడ్‌లోని రైతు గజ్జి వెంకన్న, న్యూ బంజారహిల్స్ తండాలోని రైతు ధరావత్ అంజి సాగు చేసిన వరి పంటలను ఆయన పరిశీలించారు. నివేదికను జిల్లా వ్యవసాయ అధికారి, కేవీకే శాస్త్రవేత్తలకు అందజేస్తానని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నిపుణుల ద్వారా పరిశీలన చేపట్టి, పంటల రక్షణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణి పాల్గొన్నారు.


పొట్లపహాడ్‌లో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళి


తుంగతుర్తిలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మలిదశ ఉద్యమకారులు

తుంగతుర్తి : మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం నాయకులు ఎనగందుల మల్లేష్ నేత, సర్గం మల్లయ్య మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసేందుకు గద్దర్ అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఎనగందుల సంజీవ, గుడిపాటి కిరణ్, రాంమూర్తి, చంద్రయ్య, మట్టపల్లి లింగయ్య, కోట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో శుక్రవారం పూలే, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య ఆధ్వర్యంలో గద్దర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, దొనకొండ వెంకన్న, జెర్రిపోతుల సోమయ్య, జనార్దన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోవాలి

పెన్‌పహాడ్ : చిరుధాన్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పెన్‌పహాడ్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్ సంయోగ్ నిధి ఆధ్వర్యంలో ఎస్‌వీ కిసాన్ సంస్థ ఏర్పాటు చేసిన చిరుధాన్యాల దుకాణాన్ని మండల కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో చిన్న, సన్న కారు రైతులకు ఎస్‌వీ కిసాన్ కార్డ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. చిరుధాన్యాలపై 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఇన్‌చార్జ్ పసుపులేటి సుధాకర్, జిల్లా ఇన్‌చార్జ్ బొడ్డుపల్లి సైదులు, మండల ఇన్‌చార్జ్ బచ్చలకూరి రామకృష్ణ, శెనగాని రాంబాబు, ఒగ్గు రవి, భూక్య సందీప్ రాథోడ్, నజీర్ పాల్గొన్నారు.


దుకాణాన్ని ప్రారంభిస్తున్న తూముల సురేష్‌రావు

'ఉపాధి' సిబ్బంది పెన్‌డౌన్ సమ్మె

అర్వపల్లి : తమ సమస్యల సాధన కోసం ఆందోళనకు దిగిన ఉపాధి హామీ పథకం సిబ్బంది శుక్రవారం అర్వపల్లిలో పెన్‌డౌన్ సమ్మె చేపట్టారు. తమకు పేస్కేల్ అమలుచేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, నెల నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి సుధీర్‌రెడ్డి, ఈసీ నగేష్, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీ


తిరుమలగిరి బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్


పెన్‌పహాడ్ : బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు


ఆత్మకూర్(ఎస్) : ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

తిరుమలగిరి : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అంజయ్య, ఆర్‌ఐ ముగ్దుంబాబా పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనం అందించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేడిగా ఉన్న పదార్థాలనే అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సైదులు, ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నాగారం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పస్తాల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఐలయ్య, ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు చక్రధర్, రాము, రాజశేఖర్, శ్రీనివాస్, సీఆర్పీ స్వామిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

సైన్స్ టాలెంట్ పోటీలు.. బహుమతుల ప్రదానం


పెన్‌పహాడ్ : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి


అర్వపల్లి ఎమ్మార్సీలో సైన్స్ టాలెంట్ పోటీలకు హాజరైన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు దోహదపడతాయని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. పెన్‌పహాడ్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. హర్షిత్ ప్రథమ, కె. దివ్య ద్వితీయ, అనాజీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లిఖిత ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. విద్యార్థులకు దాత కందుకూరి శివశంకర్ బహుమతులు అందజేశారు. అలాగే అల్పాహారం ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 4న సూర్యాపేటలో జరిగే జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులకు ఎంఈఓ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్‌టీ మండల కోఆర్డినేటర్లు ఎండీ జమాల్ షరీఫ్, భాస్కర్, వివిధ పాఠశాలల ఫిజికల్ సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎమ్మార్సీలో శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి. బాలునాయక్ మాట్లాడారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని చెప్పారు. ఈ పోటీలలో డి. సింధు ప్రథమ, వి. శ్రావ్య ద్వితీయ, అఖిల్ తృతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర్దెల్లి కృష్ణయ్య, ఎబెల్‌శాని, నోముల వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమారి, చెంచెల మురళి, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి ఉద్యోగుల టీమ్ లీడర్‌గా శ్రీకాంత్

తిరుమలగిరి : తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా టీమ్ లీడర్‌గా తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను పలువురు కళాకారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, కె.నాగరాజు, డప్పు శంకర్, పాక ఉపేందర్, వేణు, మంజుల, రాధ, స్రవంతి, శిరీష పాల్గొన్నారు.

హమాలీలకు సన్మానం


మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలోని స్వర్ణ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలో ఉత్తమ హమాలీలను ఎంపిక చేశారు. ఉత్తమ హమాలీలుగా ఎంపికైన రేసు సుస్వాన్, పులుగుజ్జ వెంకన్న, వల్లపు మనోజ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎలిపెద్ది మల్లారెడ్డి, కసనబోయిన శేఖర్, తోట్ల రమేష్, చిలివేరు బంగారం, జలగం యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

నాగారం : మామిడిపల్లిలో లక్ష డబ్బులు, వేల గొంతులు గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పేరాల నరేష్, ఉపాధ్యక్షుడిగా పేరాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, కార్యదర్శిగా పేరాల సత్యనారాయణ, కోశాధికారిగా పేరాల వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా పడిశాల వీరస్వామి, సలహాదారులుగా పేరాల పెద్ద శ్రీనివాస్, పడిశాల వెంకన్నలతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష డప్పులు, వేల గొంతులు తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు చిప్పలపల్లి మల్లేష్, జిల్లా కళామండలి అధ్యక్షుడు ఎర్ర అనుదీప్, కళామండలి ట్రాన్స్‌జెండర్ల నియోజకవర్గ అధ్యక్షులు చిప్పలపల్లి నిహారిక, మండల అధ్యక్షుడు వంగూరి నరేష్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దాతల విరాళం

మద్దిరాల : కుక్కడం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి మెట్లకు ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటు కోసం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కటికం నరసింహస్వామి నాగలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.3లక్షల విరాళం అందజేశారు. గ్రామస్తులతో కలిసి గ్రిల్స్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేముగంటి సుధాకర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, పులుసు రామనర్సు, వేముగంటి వేణురావు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మద్దెల రాములు, మద్దెల వెంకటనర్సు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న దాతలు

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు సన్మానం


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సూర్యాపేట : జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న సూర్యాపేట మున్సిపాలిటీ కమిషనర్ బి.శ్రీనివాస్‌ను సూర్యాపేట పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మిట్టకోల సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏలె ప్రభాకర్, కార్యదర్శి సంగిశెట్టి వెంకటేశ్వర్లు, రవి, తాటి శ్రీధర్, రెబ్బ శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శికి..


తిరుమలగిరిలో మార్కెట్ కార్యదర్శి శ్రీధర్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ పదోన్నతిపై గ్రేడ్ టూ కార్యదర్శిగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాపాక సోమేష్, శర్విరాల సుధాకర్, తాడిశెట్టి రమేష్, దామెర ఉపేందర్, పయ్యావుల వెంకన్న, సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం


జాజిరెడ్డిగూడెంలో ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కడారి లలిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. అయితే గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ 2012–13 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆపదలో ఉన్న తమ తోటి స్నేహితురాలు లలితకు శుక్రవారం వైద్య ఖర్చుల కోసం రూ. 20వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు వల్లాల ఖాజ, బట్టమేకల లింగస్వామి, కామగాని సందీప్, నర్సింగ నరేష్, కుంభం రాంబాబు, బొల్లం శ్రీకాంత్, సయ్యద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఏఎస్‌ఐకి సన్మానం


పదోన్నతి పొందిన వెంకట్రాములును సన్మానిస్తున్న ఎస్‌ఐ ఐలయ్య, పోలీసులు


నాగారం : మండల కేంద్రంలోని నాగారం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకట్రాములు ఇటీవల ఎస్‌ఐగా పదోన్నతి పొంది నల్లగొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్‌ఐ ఎం.ఐలయ్య, పోలీసు సిబ్బంది ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎల్లయ్యగౌడ్, వెంకన్న, రవీందర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, రాము, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

సూర్యాపేట టౌన్: ఎన్నికల సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమావేశాల కరపత్రాన్ని శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ పట్టణ నాయకులు రాజేష్, నవీన్, మహేష్, రాజు, వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలించాలి

అర్వపల్లి : కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ఎంఈఓ బి. బాలునాయక్ కోరారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కేజీబీవీలో బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన పత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ ఎస్. జ్యోతి, ఇన్‌చార్జ్ ఎస్‌ఓ స్వప్నమేరి, ఆశా కార్యకర్తలు స్వరూప, అరుణ, సీఆర్‌టీలు పాల్గొన్నారు.


కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన పత్రాలు ప్రదర్శిస్తున్న ఎంఈఓ, వైద్యసిబ్బంది